## క్లుప్తంగా

### ఎంఎస్ఎన్‌కు సేవారత్న అవార్డు



జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంఎస్ఎన్ దంపతులు

ఏలూరు రూరల్: సామాజిక సేవా కార్యకర్త, మానేపల్లి ఫౌండేషన్ చైర్మన్ మానేపల్లి సత్యనారాయణ(ఎంఎస్ఎన్)కు ప్రభుత్వం సేవారత్న అవార్డు అందించింది. ఆదివారం ఏలూరు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సత్యనారాయణ దంపతులకు సర్టిఫికెట్ అందజేశారు.

### పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి



కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేస్తున్న బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని వలసలు వెళుతున్న గ్రామీణ పేదలకు వ్యవసాయ కార్మికులకు తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయూ) ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం బికేఎంయూనాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి ఉపాధి హామీ పనులు గ్రామీణ పేదలకు కల్పించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించి రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలని కోరారు. మెటీరియల్ కాంపోనెంట్‌ను ప్రభుత్వమే భరించి మొత్తం ఉపాధి హామీ నిధులను కూలీలకే ఖర్చు చేయాలని ఆయన కోరారు. కలెక్టర్ ని కలిసిన వారిలో బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాల యేసు ఉన్నారు.

### కుష్టు వ్యాధిపై సర్వేకు సహకరించాలి

దెందులూరు: ప్రతి కుటుంబం ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి సహకరించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో గ్రామ శివారు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి సర్వే నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సర్వేకి వెళ్లినప్పుడు వారి వ్యక్తిగత గౌరవం ఇబ్బంది లేకుండా వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. పోతునూరు, సీతంపేట, కొత్తూరులో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ.హరి పర్యవేక్షించారు.

# మురుగు డ్రెయిన్‌లా మారిన కృష్ణా కెనాల్

- నగరంలోని చెత్త అంతా కృష్ణా కాలువలోకే
- మురికి కూపంగా తయారైన వైనం

ఏలూరు (టూటౌన్): కృష్ణా కెనాల్ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో తాగు, సాగు నీరు అందించే కాలువ సైతం మురుగు డ్రెయిన్‌ను తలపించే విధంగా మారిపోయింది. కృష్ణా కాలువలో చెత్త, వ్యర్థాలు వేయవద్దంటూ అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినా, చర్యలు చేపట్టినా చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా తయారైందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. కృష్ణా కెనాల్ ద్వారా నీరు దిగువ గ్రామాలకు తాగు, సాగు నిమిత్తం అందిస్తారు. దీంతో ఈ వ్యర్థాలని దిగువ ప్రాంతాలకు సాగు, తాగునీరుగా వెళ్తాయి. దీంతో కలుషితమైన కృష్ణా కాలువ నీటినే రూరల్ ప్రాంతాలకు చెందిన గ్రామాల ప్రజలు వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. ఏలూరు మినీ బైపాస్ నుంచి ఏలూరు తూర్పు లాకుల వరకూ కృష్ణా కాలువ నగరం మీదుగా దాదాపు ఎనిమిది కిలో మీటర్లు ప్రవహిస్తుంది. ఓ రకంగా చెప్పాలంటే ఏలూరు నగరాన్ని వన్‌టౌన్,టూటౌన్‌గా ఈ కాలువనే విడదీస్తుంది. కృష్ణా కాలువ నీరు ఏలూరు ప్రజలకు తాగు నీటి అవసరాలు తీర్చే స్టోరేజ్ ట్యాంక్‌కు, దిగువ గ్రామాలకు సాగు, తాగు నీరు అందిస్తుంది. అయితే నగరంలోని అన్ని రకాల వ్యర్థాలను తీసుకువచ్చి నేరుగా ఈ కాలువలో వేస్తుండటంతో పరిస్థితి దారుణంగా తయారైంది. వివాహాది శుభకార్యాలలో వచ్చే వ్యర్థాలు, వ్యాపారులు వేసే చెత్త, ఇళ్లలోని ప్రజలు వేసే వ్యర్థాలు అన్నీ కలిపి ఈ కాలువను ఒక మురికి కూపంగా మార్చేసాయంటే అతిశయోక్తి కాదు.

**ఫలించని చర్యలు**


కృష్ణా కాలువ ప్రక్షాళనకు ఏలూరు నగరపాలక సంస్థ అనేక చర్యలు చేపట్టింది. కాలువ వెంబడి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలిగించింది. కృష్ణా కాలువలో వ్యర్థాలను వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రచారం, సమావేశాలు నిర్వహించింది. అయితే ఇన్ని చేసినా ఏలూరు నగర ప్రజల తీరు మారకపోవడంతో ఎంతో చరిత్ర కలిగిన కృష్ణా కాలువ నేడు మురికికూపంగా మారిపోయిందనేది నగరంలోని మేధావులు, సామాజిక కార్యకర్తలు, అధికార యంత్రాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అన్ని వ్యర్థాలూ కృష్ణా కాలువలోనే**

ఏలూరు నగరం మధ్య నుంచి ప్రవహిస్తున్న కృష్ణా కాలువలోకి నగరంలోని అన్నిరకాల వ్యర్థాలు వేస్తుండటంతో కాలువ కాస్తా మురికి కూపంగా తయారైంది. తోపుడు బండ్లపైన వ్యాపారాలు చేసుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో వ్యర్థాలను కాలువలోనే వేసేస్తున్నారు అనే వాదనలు ఉన్నాయి. మార్కెట్ ప్రాంతంలో వచ్చే చెత్తలో కొంత భాగం కూడా దీనిలో వేసేస్తున్నారు. వీటికి తోడు ఇళ్లల్లో ఉపయోగించే పూజా సామగ్రి, ఇతర చెత్త అన్నింటినీ కృష్ణా కాలువలోనే పడవేస్తున్నారు. ఈ విధంగా నగరంలోని అన్ని రకాల వ్యర్థాలు కృష్ణాకాలువలోకి వచ్చి చేరుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలు కృష్ణా కాలువలో చెత్తను వేయడం మానేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



కర్రల వంతెన ప్రాంతంలో గుర్రపుడెక్క, వ్యర్థాలతో పేరుకుపోయిన కెనాల్



పాతబస్టాండ్ సమీపంలోని కృష్ణా కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలు

### దుర్గంధం వెదజల్లుతోంది



ఏలూరు నగరంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందించే కృష్ణా కాలువ నేడు దుర్గంధభరితంగా తయారైంది. గత 20 ఏళ్ల క్రితం కాలువలో రెండు వైపులా నగర వాసులు స్నానాలు చేయడం, బట్టలు ఉతుక్కోవడం వంటి అన్ని అవసరాలను తీర్చుకునేవారు. కార్తీక మాసంలో కాలువకు ఇరువైపులా రేవుల వద్ద ప్రత్యేక వసతులు ఏర్పరచి కార్తీక స్నానాలు చేసేవారు. అలాంటి కాలువ నేడు దాని వైపు కన్నెత్తి చూసేందుకు సైతం ప్రజలు భయపడే పరిస్థితి దాపురించింది. దీని ప్రక్షాళనకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– పిచ్చుక ఆదిశేషు,సీపీఎం నాయకులు,ఏలూరు

### సామాజిక స్పృహ లోపించింది



నగర వాసుల్లో క్లీన్ అండ్ గ్రీన్ పట్ల సామాజిక స్పృహ లోపించడం వల్లే కృష్ణా కాలువకు నేడు ఈ పరిస్థితి దాపురించింది. గతంలో ఏలూరు నగరానికి వింత వ్యాధి సోకి వందల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దానికి సైతం కృష్ణా కాలువ నీరు తాగు నీటి చెరువులోకి కలవడమే అని ప్రజలు భావించారు. అయినా నగర వాసులు గుణపాఠం నేర్చుకోకపోవడం బాధాకరం. ఎవరికి వారు వ్యర్థాలను కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు తరలించే చెత్త రిక్షాల్లోనే వేయాలి. కాలువలో నేరుగా వేయవద్దని కోరుతున్నాను.

– మల్లిపూడి రాజు, సామాజిక కార్యకర్త,ఏలూరు

### ఇంటర్‌లో మంచి ఫలితాలతో ఉన్నత భవిష్యత్



ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిస్టర్ మెర్సీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇంటర్మీడియట్‌లో మంచిర్యాంకును, ఫలితాలను సాధించిన తర్వాత ఆత్మస్థైర్యంతో కెరీర్‌ను ఎంచుకునే అవకాశం లభిస్తుందని స్థానిక సెయింట్ థెరీసా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎటువంటి నేపథ్యం లేకపోయినా స్వయంగా విద్యార్థులు పాఠాలను వింటూ పోటీ పరీక్షలకు తయారు కావచ్చని తెలిపారు. మన ఆసక్తి ఏంటో? మనమే గుర్తించి, విద్యార్థి జీవితంలో ఉపయోగించి నచ్చిన రంగంలో ప్రథమ స్థానంలో నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు విద్యా రంగంలో ఉన్న భవిష్యత్తు అవకాశాలను గురించి వివరించారు. అధ్యాపకులు మాధవీరాణి, హెప్సిబా, పీఎం సెలిన్ రోజ్, జ్యోతిర్మయి, ఆర్. ఇందిర తదితరులు పాల్గొన్నారు.

### రెండోరోజూ కొనసాగిన ఉరుసు ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ దర్గా ఉరుసు ఉత్సవాలు రెండోరోజు కూడా కొనసాగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఉత్సవాల్లో స్థానికులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్లు షేక్ హుస్సేన్, షేక్ షాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్ తదితరులు దువా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు నూతన అధ్యక్షుడు మద్దాల శేఖర్ బాబు అన్నారు. ది ఫొటోట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం స్థానిక ఆర్ఆర్‌పేటలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్ బాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతి సభ్యునికి అసోసియేషన్ తరపున గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. అసోసియేషన్ నూతన కార్యదర్శిగా ఎస్ఎన్‌డీ ప్రసాద్, కోశాధికారిగా ఎం. కృష్ణ కిషోర్ ఎన్నికయ్యారు. అంతకుముందు స్థానిక నరసింహారావు పేట ఓవర్‌బ్రిడ్జి మెట్ల వద్ద కెమెరా సృష్టికర్త జాక్విస్ మాండ్ డాగురే విగ్రహం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో ఫొటోగ్రాఫర్ల కోసం శాశ్వత కార్యాలయ భవనాన్ని నిర్మించుకోవడానికి ఏలూరు నగరం లేదా శివారు ప్రాంతాల్లో స్థలం ఇప్పించాలని కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఉప్పాల జగదీష్‌బాబు, ఉప్పలపాటి ప్రసాద్, ఆర్‌వీ సోంబాబు, డీవీ బాలాజీలను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

## ఇదేనా క్లీన్ ఏలూరు ?





ఏలూరు నగరంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ నుండి చొదిమెళ్ళ వెళ్ళే రహదారికి ఇరువైపులా చెత్తా చెదారంతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వస్తుంది. అటు వైపు వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిందే. నగరంలోని చెత్త, వ్యర్థాలు తీసుకువెళ్లి అక్కడ వేయడంతో మరో దంపింగ్ యార్డును తలపిస్తుంది. క్లీన్ ఏలూరు అంటే నగరంలోని డివైడర్లకు రంగులు వేయడం కాదని... ఈ వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

# కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణంపై చూపుతున్న ఆసక్తి కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న దళితలపై చూపడం లేదని ఎస్సీ ఫిషర్మెన్స్ సొసైటీ చైర్మన్ చాగంటి సంజీవ్ అన్నారు. సోమవారం ఏలూరు జాబిల్లి అతిథి గృహంలో ఎస్సీ ఫిషర్మెన్స్ సొసైటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు గ్రామాల్లో నివసించే వేలాది మంది ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. కొల్లేరుపై లంక గ్రామాల ఎస్సీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. కొల్లేరును అభయారణ్య పరిధిలో తీసుకురావడంతో లంకగ్రామాల ప్రజలు కష్టాలు మొదలయ్యాయన్నారు. ప్రధాన కార్యదర్శి పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ కొల్లేరు ప్రజలను ఆదుకుంటామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు లంకగ్రామాల్లో ప్రజలు సాంప్రదాయ చేపల వేట, చేపల సాగు చేసుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. కొల్లేరు ప్రక్షాళన తర్వాత ఉపాధి లేక అనేక గ్రామాల ప్రజలు వలస వెళ్లిపోయారని వర్కింగ్ అధ్యక్షుడు బొద్దు నోయల్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

## విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతిపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్) : విశాఖ పాల డెయిరీ యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక అన్నే భవనంలో వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధర రూ.4 లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాలసేకరణ లక్ష్యం కుదిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న విశాఖ డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార చట్టంలోకి తీసుకురావాలని కోరారు. ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం, పార్వతీపురం , విజయనగరం, అనకాపల్లి, జిల్లాల తోపాటు విశాఖపట్నం అర్బన్ జిల్లా, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలలో సుమారు 3.85 లక్షల రైతుల నుండి రోజుకు 9 లక్షల లీటర్ల ఆవు, గేదె పాలను విశాఖ డెయిరీ రోజు సేకరిస్తుందని చెప్పారు. విశాఖ డెయిరీ ప్రారంభంలో కార్పొరేషన్‌గా, తరువాత సహకార సంఘంగా మారి చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకొని మ్యాక్స్ చట్టం కిందకు తరువాత కంపెనీ చట్టం కిందకు విశాఖ డెయిరీ యాజమాన్యం మార్చిందన్నారు. కంపెనీ చట్టంగా మారడంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేక అన్ని అక్రమాలకు అవకాశం కలిగిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని విశాఖ డెయిరీ పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 33 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 45 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 27 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 35 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 29 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 31 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 30 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 26 |
| ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 28 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 33 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 32 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 25 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 34 |

## ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం

దెందులూరు: ఎంపీటీసీలకు గౌరవ వేతనం కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని వైఎస్సార్‌సీపీ నేత చల్లచింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి శ్రీమన్నారాయణ ప్రశ్నించారు. సోమవారం చల్ల చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక నెల కూడా గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు జీతాలు, రాయితీలు ప్రభుత్వ నుంచి తీసుకుంటున్నారని, మండలస్థాయికి వచ్చేసరికి వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమవుతున్నా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని 7 నెలలుగా మంజూరు గాని ఎంపీటీసీల గౌరవ వేతనాన్ని విడుదల చేయాలని ఆయన కోరారు.

### రోడ్డు భద్రతపై శ్రద్ధ అవసరం

పెదవేగి : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని రవాణా శాఖ ఆర్టీఓ మదాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ఫిబ్రవరి 15 వరకు నిర్వహించేందుకు నిర్ణయించారని తెలిపారు. ఈ సంవత్సరం రహదారి భద్రత ప్రచారం 'శ్రద్ధ వహించండి' అనే నినాదంతో ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం నవోదయ విద్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 16 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 16 | చిక్కుడు కాయలు | 44 |
| వంకాయలు (కాంతులు) | 20 | బిళ్లచిక్కుడు | 64 |
| వంకాయలు (తెలుపు) | 20 | చామదుంపలు | 44 |
| బెండకాయలు | 40 | ములక్కాడలు | 10, 15 |
| పచ్చిమిర్చి | 34 | కంద | 60 |
| కాకర కాయలు | 36 | బీట్‌రూట్ | 36 |
| బీరకాయలు | 44 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 00 | ఫ్రెంచ్‌బీన్స్ | 70 |
| క్యాబేజీ | 20 | అల్లం | 60 |
| క్యారెట్ | 36 | కొత్తిమీర (కట్ట) | 15 |
| దొండకాయలు | 36 | పాలకూర | 10 |
| బంగాళదుంపలు | 30 | చుక్కకూర | 10 |
| ఉల్లిపాయలు | 40 | తోటకూర | 10 |
| గోరుచిక్కుడు | 30 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 28 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 25-25 | క్యాప్సికమ్ | 60 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 44 |

## విద్యా ప్రణాళిక తయారీపై హెచ్‌ఎంలకు శిక్షణ



భీమడోలులో హెచ్‌ఎంలకు విద్యాప్రణాళికలపై శిక్షణనిస్తున్న పాశం పాండురంగారావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు విద్యా ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోధ్యాపయులకు 2025-26 విద్యాసంవత్సరానికి పాఠశాల, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండుగొలను హెచ్ఎంలు సత్యనారాయణ, పాశం పాండురంగారావు విద్యా ప్రణాళికలపై మెలకువలు, పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. హెచ్ఎంల అనుమానాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా ప్రణాళికలను చిత్తశుద్ధితో, తప్పుల్లేని నివేదికలను సమర్పించాలన్నారు. ఈ ప్రణాళికల ద్వారా పాఠశాలలకు బడ్జెట్ ద్వారా నిధులు సమకూరుతాయని, దీనితో పాఠశాల్లోని విద్యార్థులకు కనీస వసతులు అందుతాయన్నారు. ఉపాధ్యాయులందించే నివేదికలో పూర్తిస్థాయి సమగ్ర సమాచారం ఉండాలన్నారు. పాఠశాలల హెచ్ఎంలు షేక్ మస్తాన్, జి.బాలభాస్కర్, బాలిన సత్యనారాయణ, సీఆర్ఎంటీలు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## రోబోలు, ఏఐ జీవితంలో ముఖ్య భాగమయ్యాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుష్మప్రియ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎలక్ట్రానిక్ పరికరాలైన రోబోలు, ఏఐ మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ సహాయ ఆచార్యులు వై. సుష్మ ప్రియ తెలిపారు. నగరంలోని సీఆర్ రెడ్డి పీజీ కళాశాల ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం బేసిక్ ఎలక్ట్రానిక్స్, సూపర్ కండక్టివిటీ ఉపయోగాలు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుష్మప్రియ సూపర్ కండక్టివిటీకి ఉన్న ప్రత్యేక లక్షణాల వల్ల ప్రస్తుతం ఆసుపత్రులలో ఉపయోగిస్తున్న మ్యాగ్నెటిక్ రెసోనెన్సు ఇమేజింగ్ (ఎంఆర్ఐ) స్కానింగ్‌తో రోగ నిర్ధారణలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, అలాగే రైళ్ల మ్యాగ్నెటిక్ లెవిటేషన్ సాంకేతికతతో అత్యంత వేగంగా వెళ్లటానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అంతేకాకుండా సూపర్ కండక్టివిటీ వల్ల భవిష్యత్తులో దాదాపు ధ్వని వేగంతో సమానంగా ప్రయాణించే ×హైపర్ లూప్×సాంకేతికత అభివృద్ధి చెందిందని, అందు వల్ల రైల్వే ప్రయాణాలు అత్యంత వేగంగా జరగడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణు మోహన్, పీజీ కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కేఏ రామరాజు, పీజీ సంచాలకులు వీఆర్ఎస్ బాబు యలమర్తి, ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగ అధిపతి ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.